క్లుప్తంగా

పిల్లలకు మంచి విద్యను అందించాలి



పి.డెమో క్లాసును పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

బలిజిపేట: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పి.రావివలస ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన వెళ్లిన సందర్భంగా 5వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు బోధిస్తున్న పాఠ్యాంశాన్ని పరిశీలించారు. పాఠ్యాంశాలు బోధించేటప్పుడు మెలకువలతో కూడిన విద్యను అందించడం వల్ల వారికి సులువుగా అర్థమవుతుందని తెలిపారు. పాఠశాలకు చెందిన వివిధ రికార్డులను పరిశీలించి రికార్డుల నిర్వహణలో లోపాలు ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



అరసాడలో దగ్ధమయిన గడ్డివాములు

బలిజిపేట: మండలంలోని అరసాడలో సాలిపేట వద్ద ఉన్న గడ్డివాములు సోమవారం దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు ఎస్.సత్యనారాయణ, కృష్ణ, లక్ష్మునాయుడులకు చెందిన గడ్డివాములు దగ్ధం కావడంతో సుమారు రూ.15వేల నష్టం వాటిల్లినట్లు చెప్పారు. దీంతో పశుగ్రాసానికి రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

పార్వతీపురం: గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో గిరిజన సంఘాల నాయుకులు సోమవారం ఆందోళన చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాల, కళాశాల వసతి గృహాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ ఆందోళనలో పలువురు గిరిజన సంఘాల నాయుకులు పి.సురేష్, డి.సీతారాం, ఎ. చంద్రశేఖర్, కె.గౌరమ్మ, మంచాల పారమ్మ తదితరులున్నారు.

ఏనుగులను కవ్వించొద్దు



చెరుకు తోటలో ఉన్న ఏనుగులు

వీరఘట్టం: ఏనుగుల సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎం.హరికృష్ణ సూచించారు. కిమ్మి, నడుకూరు, చిట్టపులివలస పరిసర ప్రాంతాల్లోని పంటపొలాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోందని, అవి కంటపడితే కవ్వింపు చర్యలకు పాల్పడొద్దని కోరారు. సోమవారం చిట్టపులివలస సమీపంలోని చెరుకు తోటలో ఏనుగుల గుంపు ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడకు చేరుకుని స్థానికులను అప్రమత్తం చేశారు.

గొప్పమనసు చాటుకున్న గురువులు



చిన్నారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

భామిని: బోన్‌మ్యారో వ్యాధితో బాధపడుతున్న చిన్నారి చికిత్సకు పలువురు ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. పాతపట్నం మండలం కొరసవాడకు చెందిన సిరిపురం ప్రసాదరావు కుమారుడు సిరిపురం మోక్షజ్ఞ(3) బోన్‌మేరో వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని సిటిజన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధిత బాలుడి వైద్య ఖర్చులకు భామిని మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రూ.50 వేలు సేకరించి సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

ఈకేవైసీకి త్వరపడాలి

- ఈనెల 25 వరకూ అవకాశం
- నియోజకవర్గంలో రబీ సాగు 10,537 ఎకరాలు



వెంగాపురం ఆర్బీకేలో ఈకేవైసీ చేయిస్తున్న సిబ్బంది

బలిజిపేట: సాగు ప్రయోజనాలను రైతులకు సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం ఈ–పంట విధానాన్ని అమలు చేస్తోంది. రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేస్తోంది. ఈ ప్రయోజనాలన్నీ అందాలంటే ఈ–పంట నమోదు రైతులకు తప్పనిసరి. రైతులు ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవడం ఎంత ముఖ్యమో, ఆధార్ అనుసంధానం చేయించుకోవడం కూడా అంతే అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి రైతూ ఈకేవైసీ చేయించుకోవాలని సూచిస్తున్నారు.

ఈకేవైసీతో ప్రయోజనాలు

ఈ–క్రాప్‌లో రైతులు పంట నమోదు చేసుకోవడం వల్ల పెట్టుబడి సాయం, పంటకు బీమా, నష్టపరిహారం చెల్లింపు, గిట్టుబాటు ధర కల్పించడం, పంటకు అవసరమయ్యే ఎరువులు, పురుగుల మందులు అందించడం, అన్ని ఈ–క్రాప్ నమోదుతోనే సులభతరమవుతున్నాయి. ఈ కర్షక్ యాప్‌లో ప్రతి రైతు వివరాలను నమోదుచేస్తున్నారు. నూతన విధానంలో మొదట ఆర్‌బీకేల్లో రైతుల వివరాల నమోదు, అనంతరం క్షేత్రస్థాయిలో పంటనమోదు, చివరగా రైతు ఈకేవైసీ నమోదు చేయాల్సి ఉంది. పంట అమ్ముకునే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్పుతుంది. ఈనెల 25తో ఈకేవైసీకి గడువు ముగుస్తున్నందున పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు ఈకేవైసీకి త్వరపడాలని వ్యవసాయశాఖ అధికారులు కోరుతున్నారు.

ఈకేవైసీ పూర్తిచేసుకోండి

రైతుల పంట నమోదు పూర్తయ్యాయి. ఈకేవైసీ చేయించుకోవాల్సిన వారు ఇంకా ఉన్నారు. ఈనెల 25వ తేదీలోగా చేయించుకోవాలి. ప్రభుత్వం నుంచి రాయితీలు పొందేందుకు ఈకేవైసీ తప్పనిసరి. – వెంకటేష్, ఏడీఏ, వ్యవసాయశాఖ, పార్వతీపురం మన్యం జిల్లా

గిరిజన గ్రామాల్లో రోడ్లకు మహర్దశ

- 150 బీటీ రోడ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి ఆమోదం
- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



కురుకూటి-గంగన్న దొరవలస రోడ్డునిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజన గ్రామాల్లో రోడ్లకు మహర్దశ కలిగిందని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలంలోని కురుకూటి–గంగన్నదొరవలస గ్రామాలను అనుసంధానిస్తూ జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలోని గిరిజన గ్రామాల్లో 150 బీటీ రోడ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపి మంజూరుచేశారని తెలిపారు. సాలూరు నియోజకవర్గంలో 20 రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని వివరించారు. ఈ పనులు మార్చి నెలాఖరులోగా లేదా ఏప్రిల్ మొదటివారంలో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. రహదారులు బాగాలేవంటూ టీడీపీ నాయకులు విమర్శలు చేయడాన్ని ఆయన ఖండించారు. రాష్ట్రంలో సంక్షేమం,అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కష్టపడుతున్నారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు కుటిల రాజకీయాలుతో తప్పుడు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. రాజన్నదొర వెంట ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మువ్వల ఆదయ్య, దండి శ్రీనివాసరావు, గొర్లె రాజారావు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు సోమవారం కొత్తవలస ప్రాంతంలో గల 4వ వార్డు సచివాలయం పరిధిలో వార్డు సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై వచ్చే నెల 18వ తేదీ నుంచి గృహ సారథులు ఇంటింటికి వెళ్లి నిర్వహించ బోయే 'జగన్ అన్నే మా భవిష్యత్తు' ప్రచార కార్యక్రమం నిర్వహణపై అనుసరించాల్సిన విధి విధానాలపై వారికి వివరించారు. పురపాలక సంఘంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా చేసుకుని రానున్న 2024 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పార్టీ ఘన విజయం సాధించడమే ప్రధాన కర్తవ్యంగా తీసుకుని సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడిపై ఉందన్నారు.

జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించాలి

ముందుగానే పార్టీ క్యాడర్ అంతా సమాయత్తం అవాలని, మరీ ముఖ్యంగా సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు వారి పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరించడంతో పాటు ప్రత్యేకంగా వారికి ఈ మూడన్నరేళ్ల కాలంలో అందచేసిన సంక్షేమ పథకాలను వివరించి ప్రతి కుటుంబం నుంచి ప్రజల పూర్తి మద్దతు కోరుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించు కోవాలన్నారు. అందుకు వారి దీవెనలు అందివ్వాలని కోరుతూ రానున్న కాలంలో పార్టీ కార్యక్రమాలలో జోరుగా పాల్గొనాలని ఎమ్మెల్యే తెలుపుతూ క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, స్థానిక కోఆప్షన్ సభ్యులు మీరువ వెంకట్రావు, వార్డు ఇన్‌చార్జ్, ఏఎంసీ డైరెక్టర్ గోగు గాయత్రి, కౌన్సిలర్ ఎస్.లావణ్య, గృహ సారథులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సుల ద్వారా రూ. 7.58 లక్షల ఆదాయం

- జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్

పార్వతీపురం టౌన్: శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పార్వతీపురం మన్యం జిల్లా నుంచి వేర్వేరు ప్రాంతాలకు 52 ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామని జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక డీపీటీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18 , 19 తేదీల్లో పార్వతీపురం, సాలూరు, పాలకొండ డిపోల నుంచి 52 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక బస్సుల ద్వారా పార్వతీపురం డిపో నుంచి 7 బస్సులకు గాను రూ. 63,583, సాలూరు డిపో నుంచి 25 బస్సులకు గాను రూ 3,43,196, పాలకొండ డిపో నుంచి 20 బస్సులకు గాను రూ. 3,52,040ల ఆదాయం సమకూరినట్లు వివరించారు.

బోదవ్యాధి నివారణ మందులు పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మధుసూదన ప్రసాద్

పార్వతీపురంటౌన్: బోదవ్యాధి నివారణ మందులు పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని జోనల్ అధికారి డాక్టర్ మధుసూదన ప్రసాద్ అన్నారు. బోదవ్యాధి నివారణ మందుల పంపిణీ కార్యక్రమంపై సోమవారం స్థానిక జిల్లా మలేరియా కార్యాలయంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులకు ఎండీఏ కార్యక్రమం సక్రమంగా జరిగేలా దిశానిర్దేశం చేశారు. ఎండీఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి తులసి, డాక్టర్ జయశ్యామ్ కుమార్, ఏఎంఓ డీవీ రమణ, సూర్యనారాయణ, ఈఓ కృష్ణాజీ, కన్సల్టెంట్ రామచంద్రలు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలవాలి

పాలకొండ రూరల్: అధికార యంత్రాంగం రైతులకు అండగా నిలవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. మండలంలోని తంపటాపల్లి గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ధాన్యం అమ్మకంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని జిల్లా కలెక్టర్ ఆదేశించినా మిల్లర్ల తీరులో మార్పు రాలేదన్నారు. అపరాలకు గిట్టుబాటు ధర లేకుండా దళారులు అవస్థలకు గురిచేస్తున్నట్లు రైతులు వాపోయారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని రైతు సంఘం నాయకులు తెలిపారు. ఆయనతో పాటు కె.రామూర్తినాయుడు, బీవీ రమణ, సురేష్‌కుమార్ తదితరులున్నారు.

మరకత లింగానికి ప్రత్యేక పూజలు

పాలకొండ రూరల్: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక నక్కలపేట షిర్డీసాయి మందిరంలో కొలువుతీరిన మరకతమణి శివలింగానికి సోమవారం విశేష పూజలు, అర్చనలు చేశారు. అర్చకులు పత్రి శరత్‌కుమార్ భక్తులు సమర్పించిన పుష్పాలు, ప్రసాదాన్ని స్వామికి నివేదించారు. స్వామివారిని పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు.

అన్నసమారాధన

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని శివాలయంలో సోమవారం అన్నసమారాధన చేశారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం నుంచి మూడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చివరిరోజు నిర్వహించిన అన్నసమారాధనకు గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మొండెంఖల్‌లో జాతర

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గ్రామంలో ఈ నెల 22 నుంచి 24 వరకు వైభవ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. మూడు రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అలాగే ప్రతిరోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు..

సారా కేసులు నమోదు

పాలకొండ రూరల్: మండలంలోని అవలంగి, స్కాట్‌దొరవలస సమీపంలో సోమవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇద్దరు మహిళల వద్ద 20 లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బి.శివప్రసాద్ చెప్పారు.

వీరఘట్టం: మండలంలోని నడుకూరు సమీపంలో సారా ప్యాకెట్లతో వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 110 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కృష్ణంనాయుడు తెలిపారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



డిప్యూటీ సీఎంను సత్కరిస్తున్న నాయకులు

సాలూరు: దాసరి కమ్యూనిటీకి అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలని దాసరి కమ్యూనిటీ ఛైర్‌పర్సన్ రమాదేవి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొరను పట్టణంలోని ఆయన గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దాసరికులస్తుల్లో అర్హులకు అన్ని పథకాలు అందుతున్నాయని తెలిపారు. అర్హులైన దాసరి కులస్తులకు పథకాలు ఏమైనా రానట్లయితే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని డిప్యూటీ సీఎం పట్టణ దాసరికుల నాయకులకు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరావు, భాస్కరరావు తదితరులు ఉన్నారు.

166 మంది విద్యార్థులకు డీఈసీ మాత్రల పంపిణీ



డీఈసీ మాత్రలు విద్యార్థులతో మింగిస్తున్న ప్రిన్సిపాల్ బి.రేణుక

సీతానగరం: ఫైలేరియా రహిత సమాజ స్థాపనకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రిన్సిపాల్ బి.రేణుక అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 166 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ, ఫైలేరియా (బోదకాలు) నివారణ మాత్రలను వేసే కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ బి.రేణుక సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు చైతన్య వంతులైనప్పుడే ఫైలేరియా, బోదకాలు నివారించవచ్చన్నారు. అందుకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు డీఈసీ మాత్రలు వేసుకుని ప్రజలు వేసుకునే విధంగా చైతన్యపర్చాలని కోరారు. గ్రామాల్లో అక్కడక్కడా ఫైలేరియాతో ఇబ్బందులు పడుతుండడంతో నివారణకు అవసరమైన మందులు ప్రభుత్వం సమకూర్చుతున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ డీఈసీ మాత్రలు వేసుకునేలా వలంటీర్లు కృషి చేయాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ పీఓలు టి.రవికుమార్, డి.రామకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛందంగా సామాజిక పరమైన సేవలు అందించడానికి ఎన్ఎస్ఎస్ వలంటీర్లను సిద్ధం చేశామన్నారు. వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల నుంచి అలవర్చుకున్న ఆరోగ్య సూత్రాలను గ్రామాల్లో ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం వివరాలపై గ్రామాల్లో తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీతానగరం ఆర్‌సీహెచ్ కేంద్రం ఏఎన్ఎం బి.సింహాచలం, ఆరోగ్య కార్యకర్త సీహెచ్ సంధ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

చురుగ్గా బీటీరోడ్డు పనులు



రేపటివలస రోడ్డు పనులు

సీతానగరం: మండలంలోని పులిగుమ్మి–రేపటివలస బీటీరోడ్డు పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తామని పీఆర్(ప్రాజెక్ట్స్)ఏఈ సంతోషి కుమారి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ 1.20 కోట్ల అంచనాలతో పనులను ప్రారంభించినట్లు తెలియజేశారు. ఇంతవరకూ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా మెటల్‌తో రోడ్డు వేసినట్లు చెప్పారు. నిర్దేశించిన గడువులోగా పార్వతీపురం మండలం పులిగుమ్మి–జంక్షన్ నుంచి తామరఖండి పంచాయతీ రేపటివలస వరకు బీటీరోడ్డు వేయనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రీయ రహదారిని ఆనుకుని ఉన్న అంటిపేట నుంచి వెంకటాపురం, వెన్నెలబుచ్చింపేట మీదుగా బొబ్బిలి మండలం కోమటిపల్లి వరకు, మక్కువ–అజ్జాడ రోడ్డులో కృష్ణాపురం జంక్షన్ నుంచి అమ్మవారిగుడి వరకూ సీసీ రోడ్డు పనులకు టెండర్లు ఖరారు కావలసి ఉందన్నారు.

337 ఎకరాల్లో రబీ వరిసాగు



మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి నది పరీవాహక ప్రాంతాలు, బోర్ల ద్వారా నీటివసరులున్న గ్రామాల రైతులు రబీ వరినాట్లు వేసే పనుల్లో నిగ్నమయ్యారు. ఈ మేరకు సోమవారం ఏఓ అవినాష్ రబీ వరి నాట్లు వేసిన సాగు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ వరిసాగు అనంతరం నువ్వు పంట తీసిన 337 ఎకరాల విస్తీర్ణం భూముల్లో రైతులు రబీవరి పంటను చేస్తున్నారని తెలియజేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమకూర్చడంతో నిర్దేశించిన గడువులోగానే వరినారు వేయడం, ఉభాలు చేయడం, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. దయానిధిపురం, బూర్జ, బుడ్డిపేట, వెంకటాపురం, తామరఖండి, చినబోగిలి తదితర గ్రామాల్లో రబీవరి సాగు చేసినట్లు తెలిపారు. రైతులు కలుపు నివారణ, ఎరువుల యాజమాన్య పద్ధతులు, నీటి తడులు ఇచ్చే పద్ధతులను రైతులకు వివరించామన్నారు. అలాగే రైతులకు అవసరమైన సమాచారం ఇవ్వాలని వ్యవసాయ సహాయకులను కోరారు.

మాదక ద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: రైళ్లలో మాదకద్రవ్యాల రవాణా అరికట్టేందుకు పూర్తి చర్యలు చేపట్టామని రైల్వే ఎస్సై రవివర్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్లలో రైళ్ల ద్వారా మాదకద్రవ్యాల రవాణా చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒడిశా రాష్ట్రానికి సరిహద్దు అయిన పార్వతీపురం, పార్వతీపురం టౌన్, గుమడ, కూనేరు, రైల్వేస్టేషన్లలో పూర్తిస్థాయిలో నిఘాపెట్టామని చెప్పారు. ప్రతిరోజూ తనిఖీలు చేపతామని పట్టుబడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరి మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం



సంతాపం తెలియజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: సీనియర్ విలేకరిగా పనిచేస్తూ బెలగాం 16వ వార్డులో నివాసం ఉంటున్న జన్నేటి శ్రీనివాసరావు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అస్పత్రికి చేరుకుని విలేకరి జన్నేటి శ్రీనివాసరావు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు భార్యాపిల్లలను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం శ్రీనివాసరావు పార్థివ దేహాన్ని స్వగ్రామం తరలించేందుకు అవసరమైన అంబులెన్స్ ఏర్పాట్లను చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాగ్దేవి, వైద్యులు, ఏఎంసీ వైస్‌చైర్మన్ వానపల్లి శంకరరావు, జిల్లా పత్రికా విలేకరులు, మీడియా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.